ఓదెల: మొక్కలు నాటుతున్న బీఆర్ఎస్ నాయకులు

జూలపల్లి : పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నిండు నూరేళ్లు వర్ధిల్లు

ఓదెల, ఫిబ్రవరి 16: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ముందస్తు జన్మదిన వేడుకలు నిర్వహించారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, మరిన్ని సేవలందించాలని ఆకాంక్షించారు. ఓదెల మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఆదివారం మొక్కలు నాటారు. కేసీఆర్ జన్మదినాన్ని గ్రీన్ ఇండియా చాలెంజ్‌గా నిర్వహిస్తూ బీఆర్ఎస్ చేపట్టిన వృక్షార్చన కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కేసీఆర్ ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుడిని కోరుతున్నట్లు తెలిపారు. తెలంగాణలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రిగా పదవి చేపట్టి రాష్ట్రాభివృద్ధికి మరెన్నో సేవలందించాలని ఆకాంక్షిస్తున్నమన్నారు. కేసీఆర్‌కు మొక్కలంటే ఎంతో ఇష్టమని, ప్రతీ బీఆర్ఎస్ కార్యకర్త సోమవారం కేసీఆర్ జన్మదినాన మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గంట రాములు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డి, నాయకులు పోలోజు రమేశ్, బోయ సదానందం, బోడకుంట నరేశ్, రాచర్ల కుమార్, కుమారస్వామి, మొగిలి, వెంకటస్వామి, మహేందర్, శంకర్, శ్యామ్, శ్రావణ్, రమేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపూర్‌లో..

జూలపల్లి, ఫిబ్రవరి 16 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుస్తు జన్మదిన వేడుకలను పెద్దాపూర్‌లో బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు సంకెండ్ల లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి దాదాపు వంద మంది దివ్యాంగులు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కేసీఆర్ మరెన్నో పుట్టిన రోజు వేడుకలు నిర్వహించుకోవాలనీ, ప్రజా క్షేత్రంలో ఉన్నతంగా ఎదిగి ప్రజలకు మరింత సేవ చేసే అదృష్టం భగవంతుడు కల్పించాలని ఆకాంక్షించారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ సార్ సల్లంగుండాలని గ్రామస్తులు ఆశీర్వదించారు. ఇక్కడ పార్టీ మండల ఉపాధ్యక్షుడు బొజ్జ రాజేశం, మాజీ మండలాధ్యక్షుడు కొండపెల్లి కృష్ణమూర్తి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ తొగరు శ్రీనివాస్, నాయకులు గుండు సాగర్, గడ్డమీద భాగ్య, పెసరు మల్లేశం పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలు

గోదావరిఖని/పెద్దపల్లి, ఫిబ్రవరి 16: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం గోదావరిఖనిలో ఘనంగా వేడుకలు నిర్వహించనున్నట్లు రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక గోదావరిఖని ప్రభుత్వ దవాఖానలో మెగారక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అనంతరం ఈశ్వరకృప ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం, శ్రీ జయదుర్గాదేవి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నట్లు వివరించారు.

పెద్దపల్లిలో రక్తదాన శిబిరం

కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఏమీ ఇచ్చి తీర్చుకుందాం... తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ రుణం నినాదంతో సోమవారం పెద్దపల్లిలో రక్త దాన శిబిరం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు రక్తదానం చేసి కేసీఆర్‌పై ఉన్న తమ అభిమానాన్ని చాటుకోవాలని కోరారు.

మారుపేర్ల విజిలెన్స్ కేసులు పరిష్కరించాలి

గోదావరిఖని, ఫిబ్రవరి 16: సింగరేణి మారుపేర్లు, విజిలెన్స్ పెండింగ్ కేసులను పరిష్కరించాలని హెచ్ఎంఎస్, టీఎస్‌యూసీఎస్, టీఎన్‌టీయూసీ, ఏఐఎఫ్‌టీయూ కార్మిక సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక తిలక్‌నగర్‌లోని హెచ్ఎంఎస్ కార్యాలయంలో జరిగిన ఐక్యవేదిక సమావేశంలో వారు మాట్లాడారు. సింగరేణిలో ఎన్నో ఏండ్లుగా మారుపేర్లు, విజిలెన్స్ పెండింగ్ సమస్యలు పరిష్కరించకపోడంతో బాధితులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కారుణ్య నియామకం పేరిట సంస్థలో ఉద్యోగం కల్పించాలని వేడుకుంటున్నట్లు తెలిపారు. అనారోగ్యంతో మెడికల్ ఇన్విటేషన్ పెట్టుకుంటే పేరు మార్పిడి ఉందని, 8ఎండ్లుగా ఉద్యోగాలు ఇవ్వకుండా యాజమాన్యం కార్మికుల పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్నదన్నారు. తక్షణమే కమిటీ వేసి వన్‌టైం సెటిల్‌మెంట్ కింద వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో గుర్తింపు సంఘాలుగా గెలిచి యూనియన్ల వైఫ్యలంతో మూడు నెలలు గడిచినా ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదన్నారు. ఇక్కడ యూనియన్ ప్రతినిధులు రియాజ్ అహ్మద్, కృష్ణ, లక్క శ్రావణ్, తదితరులు ఉన్నారు.

డైరెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఏపీఏ అధికారులు

నిర్దేశిత లక్ష్యాలను భద్రతతో సాధించాలి

- **డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్‌వీ సూర్యనారాయణ**

రామగిరి, ఫిబ్రవరి 16 : నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధించాలని సింగరేణి సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్‌వీ సూర్యనారాయణ అన్నారు. ఈమేరకు ఆదివారం అండ్రియాల లాంగ్‌వాల్ గనిని సందర్శించారు. నూతన డైరెక్టర్ ఆపరేషన్స్‌గా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించి ఏఎల్‌పీ గనికి వచ్చిన సందర్భంగా ప్రాజెక్టు ఏరియా ఇన్‌చార్జి జీఎం కే నాగేశ్వరరావు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి బోల్డర్ మైనింగ్, లాంగ్‌వాల్ పనులపై చర్చించారు. లాంగ్‌వాల్ సాల్వేజింగ్ పనులు త్వరగా పూర్తి చేసి లాంగ్‌వాల్ నుంచి భద్రతతో కూడిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని అందుకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, ఇంజినీర్ యాదయ్య, రఘురాం, డీజీఎం జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ హిందీ పుస్తక లైబ్రరీ ప్రారంభం

జ్యోతినగర్, ఫిబ్రవరి 16: అధికార భాష హిందీని ప్రోత్సహించడానికి ఎన్టీపీసీ యాజమాన్యం నేషనల్ బుక్ ట్రస్ట్‌తో కలిసి మొబైల్ హిందీ పుస్తక గ్రంథాలయాన్ని ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో ఆదివారం ప్రారంభించింది. ఎన్టీపీసీ ఏజీఎం హెచ్ఆర్ బిజోయ్‌కుమార్ సిక్దర్ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ మొబైల్ లైబ్రరీని ప్రారంభించి మాట్లాడారు. ఈ మొబైల్ ద్వార సమీపంలోని ప్రతి పాఠశాలకు అందుబాటులోకి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు విభిన్న రకాల సాహిత్య, విద్య వనరులకు సంబంధించిన పుస్తకాలు లైబ్రరీలో అందుబాటులో ఉంటాయన్నారు.

బస్సులో నుంచి జారిపడి మహిళకు గాయాలు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 16: మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన ఎడ్ల సరోజన అనే మహిళ పెద్దపల్లి లోని శాంతినగర్ శివారులో ఆదివారం ఆర్టీసీ బస్సులో నుంచి జారీ కింద పడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం గాయపడిన బాధితురాలిని చికిత్స కోసం దవాఖానకు తరలించారు.

ఘనంగా సేవాలాల్ జయంతి

ధర్మారం/కోల్‌సిటీ, ఫిబ్రవరి16:ధర్మారం మండలం లంబాడి తండా (బి), గోదావరిఖనిలోని గాంధీనగర్‌లో ఫారెస్ట్ డీజీఎం కర్ణ ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ హాజరయ్యారు. సేవాలాల్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బంజారా కులస్తులు, సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు, మాజీ కార్పొరేటర్లు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడి దుర్మరణం

ధర్మారం,ఫిబ్రవరి16: మండల కేంద్రానికి చెందిన నార మహిపాల్ (32) బైక్ అదుపు తప్పి దుర్మరణం చెందాడు. ఈ ఘటన ధర్మారంలో విషాదం నింపింది. ఎస్ఐ లక్ష్మణ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహిపాల్ ఎండపల్లి మండలానికి ఓ పనిపై బైక్ మీద వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో తిరిగి వస్తుండగా మండల కేంద్రం శివారులో ధర్మారం–ఎండపల్లి మార్గం మధ్యలో ఆర్అండ్‌బీ రోడ్డులో సలాంద్రి వద్ద ఉన్న క్రీడా ప్రాంగణం సమీపంలో బైక్ అతి వేగంగా అదుపు తప్పి రోడ్డు దూసుకెళ్లి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతని తలకు రక్త గాయం కాగా పక్కటెముకలు విరిగాయి. స్థానికుల సమాచారంతో కుటుంబ సభ్యులు అతడిని కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి చనిపోయాడు. మృతుని తమ్ముడు జైపాల్ ఫిర్యాదు మేరకు మృతుడి శవానికి పంచనామా, పోస్టు మార్టం నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

సర్వేలో వివరాలు నమోదు చేసుకోవాలి

మంథని, ఫిబ్రవరి 16: సర్వేలో వివరాలను నమోదు చేసుకోని వారు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఎంపీడీవో శశికళ, మున్సిపల్ కమిషనర్ మనోహర్ సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్‌లో మండలంలోని ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పట్టణంలోని 13 వార్డులకు సంబంధించిన ప్రజలు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 28 వరకు నిర్వహించనున్న ప్రత్యేక నమోదు కేంద్రాల్లో ప్రజలు దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

జూలపల్లి, ఫిబ్రవరి 16 : మండలంలో రెండో దఫా సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల గణన సర్వేను (ప్రజా పాలన సేవ కేంద్రం) అధికారులు ప్రారంభించారు. ఈ నెల 28 వరకు కుటుంబ సర్వే కొనసాగుతుందని వివరించారు. ఇక్కడ ఎంపీడీవో పద్మజ, ఎంపీవో అనిల్‌రెడ్డి, కార్యదర్శులు పిల్లలమర్రి అజయ్‌కుమార్, మద్దెల సతీశ్ ఉన్నారు.

రామగిరి, ఫిబ్రవరి 16 : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజా పాలన సేవా కేంద్రం ఏర్పాటు చేశామని ఎంపీడీవో తెలిపారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల గణనలో భాగంగా ఇదివరకు జరిగే సర్వేలో వివరాలు సమర్పించని వారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందన్నారు. ఈనెల 16 నుంచి 28వ తేదీ వరకు సర్వే సిబ్బందికి వివరాలు సమర్పించని వారు కార్యాలయంలో సమర్పిస్తే ఆన్‌లైన్ చేస్తారని తెలిపారు.

జయదుర్గాదేవి ఆలయంలో శతచండీ మహాయాగం

పూజలో పాల్గొన్న కొప్పుల దంపతులు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 16: గోదావరిఖని జవహర్‌నగర్‌లోని శ్రీ జయదుర్గాదేవి ఆలయంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్–స్నేహలత దంపతుల ఆధ్వర్యంలో హోమ మహారుద్ర సహిత హోమ శత చండీ మహాయాగం ఆదివారం ప్రారంభమైంది. నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు చండీ రుద్ర హోమాలు శ్రీరాంభట్ల శివ శర్మ మంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి, ఆలయ వ్యవస్థాపకులు కొప్పుల ఈశ్వర్–స్నేహలత దంపతులు యాగంలో పాల్గొన్నారు. సోమ, మంగళవారాల్లో కూడా యథావిధిగా చండీ రుద్రహోమాలు ఉంటాయని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని యాగ నిర్వాహకుడు శివశర్మ తెలిపారు. ఈ నెల 19న హోమంతో పాటు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఉంటాయని వివరించారు.

వివాహ వేడుకలకు హాజరైన మాజీ మంత్రి కొప్పుల

ధర్మారం,ఫిబ్రవరి16: ఖానంపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నేత ,ఏఎంసీ మాజీ చైర్మన్లు గుర్రం మోహన్ రెడ్డి–లలిత దంపతుల కూతురు మనీషారెడ్డి–సుమంత్ రెడ్డి వివాహ వేడుకలకు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ –స్నేహలత దంపతులు హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, నంది మేడారం ప్యాక్స్ చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, మాజీ ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాచూరి శ్రీధర్,ఏఎంసీ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముత్తారం, ఫిబ్రవరి 16: సీతంపేట లో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కూర కుల ఓదెలు కూతురు సుప్రియ–అనిల్ వివాహ వేడుకలకు మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్–పుట్ట శైలజ దంపతులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఖమ్మంపల్లిలో కొండపర్తి సంధ్య–సమ్మయ్య కూతురు రిషిక కర్ణవేదనంలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఇక్కడ మండలాధ్యక్షుడు పోతుపెద్ది కిషన్ రెడ్డి, మాజీ ఎంపీపీలు జక్కుల ముత్తయ్య, అత్తె చంద్రమౌళి, మాజీ సింగిల్ విండో చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుధాడి రవీందర్‌రావు, సర్పంచుల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు నూనెకుమార్, నాయకులు గాదం శ్రీనివాస్, ఎర్రం సదానందం, రామగళ్ల మహేందర్, వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సహకార సంఘాన్ని అభివృద్ధి చేశాం

మంథని, ఫిబ్రవరి 16: మంథని సహకార సంఘాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. మంథనిలోని సంఘం కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ, కరోనా లాంటి కష్టకాలంలో కూడా ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని సంఘాన్ని ద్విగ్విజయంగా నిర్వహిస్తూ సభ్యులు, రైతుల అవసరాలను తీర్చామన్నారు. సహకార సంఘం ద్వారా మరిన్ని సేవలను విస్తరింపజేసి సంఘ సేవలను రైతులకు చేరువ చేస్తామన్నారు. తాము 15 ఫిబ్రవరి 2020లో అధికారంలోకి వచ్చే నాటికి సంఘంలో 2,984 మంది సభ్యులు రూ.80,54,658 వాటాధనం ఉందన్నారు. ప్రస్తుతం ఆ సంఖ్య 3,540 మందికి చేరిందని, సభ్యుల వాటాధనం రూ.1,27,67,902ఉందన్నారు. అలాగే, సంఘంలో ఫిక్స్‌డ్ డిపాజిట్లు రూ. 1,72,72,653 ఉండగా, ప్రస్తుతం రూ.3,64,47,394కు చేరుకుందన్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో రైతుల నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని సేకరించామన్నారు. ఎరువులు, విత్తనాలు ఎమ్మార్పీ ధరకే విక్రయిస్తున్నామన్నారు. పెట్టుబడులకు సకాలంలో రుణాలు అందజేసి వారికి వెన్నుదన్నుగా నిలుస్తున్నామని తెలిపారు.

20న చలో హైదరాబాద్

కోల్‌సిటీ, ఫిబ్రవరి 16: ఈనెల 20 న హైదరాబాద్‌లో తలపెట్టిన నిరసన ప్రదర్శనకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు కోరారు. ఈమేరకు ఆదివారం గోదావరిఖనిలో ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు బీ.అశోక్, ఐఎఫ్‌టీయూ నాయకులు ఇ.నరేశ్, వెంకన్న, రాధమ్మ, లక్ష్మీ, పద్మ, దుర్గమ్మ, కృష్ణవేణి పాల్గొన్నారు.

రామగిరి ఫిబ్రవరి 16 : ఈ నెల 20న హైదరాబాద్‌లో నిర్వహించే భారీ నిరసన ప్రదర్శన, సభకు ప్రజలు కదిలి జయప్రదం చేయాలని సీపీఐ (ఎం–ఎల్)న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు వెంకన్న పిలుపునిచ్చారు. సెంటినరీకాలనీలోని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంలో చలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, వైద్య సమస్య పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఐఎఫ్‌టీయూ నాయకులు ఎస్ రజిత, ఒదెమ్మ, కనకలక్ష్మి, పద్మ, సరోజన, మల్లమ్మ భాగ్య, రాణర్సు, రమేశ్, షరీఫ్, లింగన్న, శ్రీనివాస్, రాజమౌళి, రమేశ్, సంపత్ పాల్గొన్నారు.

జిల్లా జట్టుతో పీడీ డాక్టర్ వేల్పుల సురేందర్, పీఈటీలు

సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ పోటీలకు జిల్లా జట్టు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 16: ఆల్ ఇండియా ఇంటర్ డిస్ట్రిక్ట్ హ్యాండ్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు ఈ నెల 17 నుంచి20 వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరుగనున్నాయి. ఈ పోటీలకు జిల్లా నుంచి జట్టును ఎంపికను చేశారు. పోటీల్లో పాల్గొనేందుకు టీమ్ కోచ్‌లు, మేనేజర్లు తిరుపతి, అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో క్రీడా కారులు ఆదివారం హైదరాబాద్ బయలుదేరి వెళ్లినట్లు హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్, పీడీ డాక్టర్ వేల్పుల సురేందర్ తెలిపారు. అలాగే పెద్దపల్లి మండలం అప్పన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సిద్దార్థ, సృజన్, చరణ్‌లు ఈ పోటీలకు ఎంపిక కాగా వారిని హెచ్ఎం సట్టు పురుషోత్తం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

నడకతో ఆరోగ్యం

పెద్దపల్లి/పెద్దపల్లి టౌన్, ఫిబ్రవరి16: నడకతో (వాకింగ్) ఆరోగ్యంతో పాటు ఆయుష్షు కూడా పెరుగుతుందని ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ డిప్యూటీ గవర్నర్ వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యుల ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ వాకింగ్ చేయాలన్నారు. వాకింగ్ చేసిన వారు ఆరోగ్యంతో పాటు తన రోజువారి విధుల్లో యాక్టివ్‌గా ఉంటారని తెలిపారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీగా రాచకట్ల నరసింహస్వామి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌గా సయ్యద్ అతీఫ్ బాధ్యతలు చేపట్టగా, వారిని పూల మాల శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ కో –ఆర్డినేటర్ సందీప్ రెడ్డి, ఐటీఐ వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడు కొట్టే లక్ష్మణ్, సెక్రెటరీ చింతపండు రాజమల్లు, పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజ్ గ్రౌండ్ వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడు హైటెక్ శ్రీనివాస్, సెక్రెటరీ తిరుపతి గౌడ్, అడిచర్ల రమణమూర్తి, అమలాపురం శ్రీనివాస్, పడాల సతీశ్ గౌడ్, తిరుమల్ పాల్గొన్నారు.

పెళ్లి కాలేదని మనస్తాపం..

జ్యోతినగర్, ఫిబ్రవరి 16: పెళ్లికావడం లేదని మనస్తాపంతో ఆదివారం రామగుండంలో పుల్లూరి బాలాజీరావు(34) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రామగుండం ఎస్ఐ సంధ్యారాణి తెలిపిన వివరాల ప్రకారం బాలాజీ రావు పట్టణంలోని పోస్టాఫీస్ పక్కనున్న విద్యుత్‌శాఖ క్వార్టర్ నివాసి. వయసు మీరుతున్న పెళ్లి కాకపోవడంతో మనస్థాపానికి గురయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు బెడ్‌షీట్‌తో ఊరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి భగవన్‌రావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేపట్టారు.

కరాటే పోటీలు ప్రారంభం

పెద్దపల్లి టౌన్, ఫిబ్రవరి16: పెద్దపల్లిలోని సిరి ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన దుద్దిళ్ల శ్రీపాదరావు మెమోరియల్ కరాటే పోటీలను దుద్దిళ్ల శ్రీను బాబు ఆదివారం ప్రారంభించారు. ఇక్కడ జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి క్రీడాకారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కరాటే మాస్టర్స్ సంపత్ రావు, యాదగిరి, రామస్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూల, అంబేద్కర్ జ్ఞానమాల

కోల్‌సిటీ : అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 16: ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం, ఆలయ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పూలే, అంబేద్కర్ జ్ఞానమాల నిర్వహించారు. కార్మిక నాయకులు తోట వేణు, కేబుల్ టీవీ ఆపరేటర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మంతెన సంపత్ హాజరై అంబేద్కర్, పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఈ జ్ఞానమాల నిర్వహించడం అభినందనీయమని పేరొన్నారు. ఇంటింటికీ ఈ కార్యక్రమం కూడా చేపడితే బాగుంటుందని పేర్కొన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా కూడా నిర్వహించే బాధ్యత తీసుకోవాలని కోరారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైస రాజేశ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘం నాయకులు బొంకూరి మధు, తీట్ల రమేశ్‌బాబు, కొంకటి లక్ష్మణ్, మంతెన లింగయ్య, బూడిద మహేందర్, మిట్టపల్లి రాజేంద్ర కుమార్, ఆర్నకొండ వెంకటేశ్వర్లు, బొట్ల స్వామి, పోగుల రంగయ్య, బొంద య్య, గద్దల శశిభూషణ్, కల్వల రాజేశం, ఉప్పులేటి పవన్, కరీం, శనిగరపు చంద్రశేఖర్, కనుకుంట్ల సమ్మయ్య పాల్గొన్నారు.

కమాన్‌పూర్‌లో ..

కమాన్‌పూర్, ఫిబ్రవరి 16 : మండల కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్‌లో ఆదివారం పూలె, అంబేద్కర్ జ్ఞానమాల నిర్వహించారు. ఆలిండియా అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు అంబటి కనకయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. పలువురు పూలే, అంబేద్కర్ గురించి వివరించారు. బీసీ సంఘాల నాయకులు నల్లవెల్లి శంకర్, రంగు సత్యనారాయం, ఆలిండియా అంబేద్కర్ సంఘం నాయకులు దాసరి రామస్వామి, పొనగంటి రాజనర్సు, రాంచందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 వసంతాలు పూర్తి చేసుకున్నందున జ్ఞానమాల కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. సుంచు శ్రీనివాస్ రెడ్డి, శేఖర్, రమేశ్, మట్ట నర్సయ్య, జంగ సతీశ్, జంగపల్లి తిరుపతి, జంగపల్లి లక్ష్మణ్, జంగపల్లి శ్రీనివాస్, సమ్మయ్య, రాజయ్య, ఆరెల్లి పేరయ్య, బోగ శ్రీహరి, రాజనర్సు, తాటిపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందిస్తున్న కరస్పాండెంట్ ఇస్మాయిల్

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

పాలకుర్తి,ఫిబ్రవరి16: పాలకుర్తి మండలం జీడీనగర్ యూనివర్సల్ పాఠశాలకు చెందిన విద్యార్థి ఎల్.చరణ్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ ఇస్మాయిల్ పేర్కొన్నారు. ఈనెల 17 నుంచి 20వ తేదీ వరకు హైదరాబాద్ బాలయోగి స్టేడియంలో జరిగే పోటీలకు రాష్ట్రం తరపున పాఠశాల విద్యార్థి ఎల్. చరణ్ పాల్గొనడం అభినందనీయమని ఉపాధాయులు పేర్కొన్నారు.

కమాన్‌పూర్ : సమ్మేళనంలో కమాన్‌పూర్ జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు

కమాన్‌పూర్ : గెట్ టు గెదర్‌లో సింధూర ఐటీఐ పూర్వ విద్యార్థులు

ధర్మారం : సమ్మేళనంలో నందిమేడారం జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

రామగిరి/పాలకుర్తి/కమాన్‌పూర్/ధర్మారం, ఫిబ్రవరి 16 : జిల్లాలోని పలు విద్యాసంస్థల పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. పెద్దపల్లిలోని సింధూర ఐటీఐ 1995–97 బ్యాచ్ విద్యార్థులు బసంత్‌నగర్ బుగ్గగుట్టలో అపూర్వ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. గోదావరిఖని విద్యుత్ ఏఈగా ఉద్యోగోన్నతి పొందిన జమీల్‌ను అప్పటి ఇన్‌స్ట్రక్టర్స్ మిత్రులు సన్మానించారు. కమాన్‌పూర్ జిల్లా పరిషత్ పాఠశాల 1998–99 బ్యాచ్ విద్యార్థులు పెద్దపల్లి–మంథని లక్ష్మీగార్డెన్‌లో అప్పటి ఉపాధ్యాయులను సత్కరించి జ్ఞాపికలు అందించారు. సుమారు రూ. 50వేల విలువైన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు. పాఠశాలలో స్వీపర్‌గా పనిచేసి రిటైర్ అయిన కళావతికి రూ. 3వేలు సాయం అందించారు. ధర్మారం మండలం నంది మేడారం జడ్పీ ఉన్నత పాఠశాల 2000–01 బ్యాచ్ విద్యార్థులు అప్పటి ఉపాధ్యాయులు ఒకే వేదికపై కలిశారు. అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. రోజంతా ఆనందంగా గడిపారు.

విధులు బహిష్కరించిన కాంట్రాక్ట్ కార్మికులు

గోదావరిఖని, ఫిబ్రవరి 16: సింగరేణి ఆర్జీ–1 పరిధి ఓసీపీ 5లో ఆదివారం కాంట్రాక్ట్ కార్మికులు విధులు బహిష్కరించారు. ప్రాజెక్టులో ఓబీ పనులు, ఓవర్ బర్డెన్ పనులు నిర్వహించే పీసీ పటేల్ కంపెనీ గత రెండు సంవత్సరాలుగా వేతనాల పెంచకుండా వెట్టి చాకిరీ చేయిస్తున్నారని ఆరోపిస్తూ కార్మికులు విధులను బహిష్కరించి ఆందోళనకు దిగారు. తమకు వేతనాలను పెంచే వరకు విధులు బహిష్కరించనున్నట్లు వారు పేర్కొన్నారు. ప్రాజెక్టులో కార్మికుల విధుల బహిష్కరణతో బొగ్గుపై కప్పబడే మట్టి వెలికితీత పనులు నిలిచిపోయాయి.